
## కన్నతల్లిగా బాధ్యతలు వీడి ఆమె ప్రేయసిగా మారడానికి కారణం?

# నాకూ తోడు కావాలి




''గిరిజా, ...'' మందుల షాపులో చీటీ చూపించి మందులు కొంటున్న నేను ఆ పిలుపుకి ఒక్కసారి ఉలిక్కిపడ్డాను. ఆ గొంతు గుర్తుపట్టానా... కాదు కాదు.. ఆ పిలుపులోని భావం... మార్దవం ఎన్నేళ్లయినా మర్చిపోలేని ఆ పలకరింపు... కళ్లజోడు సర్దుకుంటూ వెనక్కి తిరిగి చూశాను.

సన్నగా, ఇస్త్రీలేని పంచె, లాల్చీ. చేతిలో ఏదో బాగ్‌తో కళ్లజోడుతో ఫణీంద్ర... ఫణీంద్ర... ఆనందంతోనో, బాధతోనో నాకే తెలియదు నా శరీరం సన్నగా కంపించింది.

''గిరిజా... మీరు గిరిజేనా... నేను ఫణీంద్రని'' తడబడుతూ అతడన్న మాటలకి చప్పున తలూపాను.

''బావున్నారా... ఇప్పుడెక్కడ వుంటున్నారు మీరు. గొంతు గాద్గదికమవడంతో మాట సరిగా రావడంలేదు. నా పరిస్థితి అర్థం చేసుకున్నాడేమో, ''అలా రా గిరిజా... సారీ రండి... అక్కడకెళ్లి కూర్చుందాము'' ఎదురుగా ఉన్న పార్కువైపు నడిచాడతడు.

తెలిసినవాళ్లు ఎవరైనా చూస్తారేమో అనుకుంటూ భయంగా చుట్టూ చూశాను. అలా ఎలా అతనితో పార్కుకి వెళతాను? నాలుగడుగులు వేసి నేను రాకపోయేసరికి నావైపు తిరిగాడతడు.

''ఇంకా ఇన్నేళ్లయినా ఆ బెరుకు పోలేదా, ఆ పిరికితనం పోలేదా'' ఈ మాటలేవీ అతను అనలేదు. నావైపు చూసిన ఆ చూపులో నాకదే అర్థం కనిపించింది. నెమ్మదిగా అతనితోపాటు పార్కుకి వెళ్లాను. అందరికీ దూరంగా పచ్చికబయలుపై తన కండువా పరిచి నన్ను కూర్చోమని తనూ కూర్చున్నాడు. చిన్న కంపనం నాలో... ఎందుకో నాకే తెలియదు. ఒకప్రక్క ఎవరైనా చూస్తారన్న భయం. మరోపక్క ఇంత హఠాత్తుగా ఇన్నేళ్ల తర్వాత ఇతడిలా



కనిపించడం. నాకు చాలా అసౌకర్యంగా వుంది పరిస్థితి.

పార్కులో ఆడుకుంటున్న పిల్లలవైపు చూస్తున్న అతడిని చూశాను నేను. జుట్టు బాగా నెరిసిపోయింది..ముఖంపై ముడతలు, వృద్ధాప్యానికి చిహ్నంగా ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. మాసిన బట్టలు... ఆర్థికంగా కూడా అంత బాగా లేనట్టుగానే అనిపిస్తున్నాడు.

ఎన్నేళ్లయింది ఇతడిని చూసి... నా జీవితపు చరమాంకంలో మళ్లీ ఇతనినిలా కలుస్తానని కల్లోకూడా అనుకోలేదు. ఎప్పుడో నలభై ఏళ్ల క్రితం... విశాఖపట్నం కో-ఎడ్యుకేషన్ కాలేజీలో కలిసి చదివేవాళ్లం. నేను పియుసి చదివేదాన్ని. అతడు బిఎస్సీ చదివేవాడు. కాలేజీలో చదువుతున్నాననే మాటేగాని చాలా పిరికిగా, బెరుకుగా వుండేదాన్ని. నా బెరుకు పోవాలనే మా అమ్మ వద్దంటున్నా మా అన్నయ్య నన్నుబలవంతంగా కాలేజీలో చేర్పించాడు.

స్నేహితులు, సరదాలు పెద్దగా వుండేవికావు నాకు. నాలో ఏ ప్రత్యేకతా లేని నన్ను ఎలా ఇష్టపడ్డాడో తెలియదు. ఫణీంద్ర నా జీవితాన్ని చైతన్యవంతం చేశాడు. ఒక కాలేజీ ఫంక్షనులో కలిసి నాతో పరిచయం పెంచుకున్నాడతడు. ''గిరిజా అలా డల్‌గా వుండకూడదు... చలాకీగా వుండాలి. నీలో నీకు తెలియని టాలెంట్స్ ఉన్నాయి. అవన్నీ బాగా డెవలప్ చేసుకోవాలి. అందరితో ఫ్రీగా మాట్లాడాలి. జీవితాన్ని సంతోషంగా గడపాలి'' ఎప్పుడు కలిసినా అతనిలాంటి మాటలే చెప్పేవాడు. మాటలతో, చేతలతో ఎంతో పరిపక్వత చెందిన మనిషిలా అన్పించేవాడు. అతనిని అందరూ గౌరవించినట్లే, నేనూ గౌరవించేదాన్ని. ఆ గౌరవంలోనే నాకు తెలియకుండా నేను అతనివైపు ఆకర్షితురాలవుతున్నానన్న విషయం గమనించగానే చిగురుటాకులా వణికిపోయాను. ప్రేమ... ఎంత మధురానుభూతి... ఎంత తియ్యని భావన... ఎంత గొప్ప వరం... ఏ కవికి, ఏ రచయితకి, ఏ చిత్రకారుడికీ అందని అద్భుతమైన నిర్వచనం... ప్రశాంతంగా వున్న మనసుని చిన్నగా తట్టి లేపిన ఆ ప్రేమ... దానిపేరే ఫణీంద్ర.

కాని... కాని అది ఎలా అతనికి తెలియబరచడం... పిరికితనం... జంకు... భావాలని బయటకు చెప్పలేని నిస్సహాయత. నాలోనే మూగగా అతనిని ఆరాధించేదాన్ని. పరీక్షలు అయిందనిపించాను. అంతకన్నా చదివే ఆసక్తి లేదు. ఆర్థిక బలం లేదు. పెద్దగా మార్కులురావనీ తెలుసు.

పరీక్షలైపోయిన వారం రోజుల తరువాత జగదాంబ సెంటర్‌లో కన్పించాడు ఫణీంద్ర. మనసు విహంగమైంది. మామూలు మాటలయ్యాక మెల్లగా అతడే అన్నాడు.

''గిరిజా... నీతో కొంచెం మాట్లాడాలి... ఆ రెస్టారెంట్‌లో కూర్చుందాం... రా'' అని.

చాలా భయపడిపోయాను. అమ్మో అలా ఎలా వెళ్తాను... నాన్నకు తెలిస్తే... అన్నయ్య చూస్తే... మింగిలా దిక్కులు చూస్తున్న నన్ను అతను మరోసారి అడిగాడు. నాకు వెళ్లాలని, అతనితో మాట్లాడాలని... నా మనసు తెలియబరచాలని...ఇంతకంటే అవకాశం మళ్లీ దొరకకపోవచ్చనీ... ఎన్నెన్నో ఆలోచనలు.

భయంభయంగా అతడితోపాటు రెస్టారెంట్‌కి వెళ్లి కూర్చున్నాను. కాఫీకి ఆర్డర్ ఇచ్చి అతను చెప్పాలనుకున్నది సూటిగా చెప్పేశాడు. ''గిరిజా... నేను ఎం.ఎస్సీ. చేద్దామనుకుంటున్నాను. చదువు, ఉద్యోగం ఎంత లేదన్నా రెండు మూడేళ్లు పడుతుంది. నాకు నువ్వంటే చాలా ఇష్టం. పెళ్లంటూ చేసుకుంటే నిన్నే చేసుకుంటాను. నీ అభిప్రాయం ఏమిటి? నేను నీకు చెప్పాలనుకుంటున్నది ఏమిటంటే, నా ప్రేమని అంగీకరించి, నాకోసం రెండేళ్లు ఆగగలవా... అప్పుడు జీవితం ఒక దారిలో పడుతుంది. మీ పేరెంట్స్‌తో వచ్చి మాట్లాడమంటే మాట్లాడతాను. ఈ లోపల నువ్వు ఏదైనా కోర్సులో చేరు'' మృదువుగా మంద్రస్థాయిలో అతడన్న ఆ మాటలకి నా మనసు ఉవ్వెత్తున ఎగిసిపడే జలపాతంలా పరవళ్లు తొక్కింది. ఫణీంద్రలాంటి ఉత్తముడు దొరికితే ఇంతకంటే జీవితానికి కావాల్సినదేముంది. అదృష్టం తలుపు తడుతోంది.

కానీ... మళ్ళీ... అదిగో భయమే... వెనక్కి లాగుతోంది.

నాన్న చండశాసనుడు... అన్నయ్య సరేసరి ఆ తండ్రిని మించిన కొడుకు... ఉద్యోగం సద్యోగం లేనివాడికోసం రెండేళ్ళు ఆగి అతడికిచ్చి పెళ్ళి చేస్తారన్నది పిచ్చి భ్రమ. ఎంత త్వరగా ఆడపిల్లని పెళ్ళిచేసి పంపించాలా అన్నదే వాళ్ళదృష్టి. చదువుకేవలం పెళ్ళికోసమే.. కానీ ఇవన్నీ ఇతనితో ఎలా చెప్పడం. అలాగే ఇతని గురించి తండ్రితో ఎలా చెప్పడం. అన్నీ భయాలే!

''గిరిజా ఇందులో తొందరపడాల్సిందేమీ లేదు. నేను నెల్లాళ్ళపాటు మా ఊరుకి వెళ్తున్నాను. నాకూ కొన్ని బాధ్యతలున్నాయి. మావాళ్ళకి చెప్పి వస్తాను. నువ్వు మళ్ళీ వచ్చేనెల ఇదేరోజు, ఇదేచోటుకి వచ్చి నీ నిర్ణయం చెప్పు. ఐ విష్ ఐ యామ్ లక్కీ. నన్ను కాదనవనే నా నమ్మకం''

అయ్యో ఫణీ నీకెలా చెప్పడం... నువ్వంటేనాకు ప్రాణం. నీకు భార్యనయ్యే అదృష్టంకన్నా మించింది లేదు. కానీ రెండేళ్ళు ఆగాలి... ఈ లోపల ఏం జరుగుతుందో.

''ఇదిగో నా అడ్రస్సు'' అంటూ అతడు చిట్టీమీద రాసిచ్చిన దానిని తీసుకుని వస్తానని చెప్పి ఇంటికొచ్చేశాను. ఒక పదిరోజులలో, వరుసకి దూరం మేనత్తకొడుకని బ్యాంకులో పనిచేస్తున్నాడని, తెలిసిన సంబంధం అని రఘుతో నా పెళ్ళి నిర్ణయించేశారు నాన్న.

''నాకీ పెళ్ళి వద్దునాన్నా... నా ఇష్టాఇష్టాలు లేకుండానే మీరంతా ఎలా నిర్ణయించేశారు... ఫణి తప్ప నా మనసులో మరెవ్వరికీ చోటులేదు... ఒక్క నెలరోజులాగితే చదువు ఉద్యోగం లేకపోయినా అతనినే పెళ్ళిచేసుకునేదాన్నే. ఎంత పనిచేశారు మీరు. అమ్మా వద్దు'' ఇవన్నీ నా మూగరోదనలు. ఆగని ఆక్రందనలు. తొందరగా ఫణిని రమ్మని రాద్దామని అనుకున్నా అద్ధో భయం. అతనొస్తే నాన్న చంపేస్తారు. ముహూర్తాలు కూడా పెట్టేసుకున్నాక ఇప్పుడిలా చేస్తే అమ్మో... ఏం చేయాలో తెలిసిందికాదు.

ఆ భయం, అయోమయస్థితిలో నా పెళ్ళి రఘురాంతో జరిగిపోయింది. ఏదో గిల్టీ భావం. ఫణీంద్రకి శుభలేఖకూడా పంపలేదు.

ఎలా తెలుసుకున్నాడో ఫణీంద్ర నా పెళ్ళయిన విషయం తెలుకుని, ఒకసారి మా ఇల్లు వెతుక్కుంటూ వచ్చాడు. తన పేరు, అడ్రసు ఉన్న

## బోర్డు

ఒక గవర్నమెంట్ ఆఫీసులో ఇలా బోర్డుంది.
''దయచేసి గట్టిగా మాట్లాడకండి'' అని.
దానికి ఎవరో కొన్ని పదాలు తగిలించారు. అప్పుడది ''దయచేసి గట్టిగా మాట్లాడకండి. ఉద్యోగులు నిద్రలేస్తారు'' అయింది.

- పి.వి.మురళీకృష్ణ (హైదరాబాద్)



కాయితం ఆరోజు మేము ఇంట్లోలేమని మా పక్కవాళ్లకిచ్చి వెళ్లాడు. ఆ కాయితం చూసి ఎలా భయపడిపోయానో... ఈ విషయం ఆయనకి తెలిస్తే ఇంకేమన్నా వుందా. గబగబా ఆ చీటీ చింపేసి ఊపిరి పీల్చాను.

చీటీ అవుతే చింపానుకానీ, ఫణీంద్ర నా జ్ఞాపకాలలోంచి ఎప్పుడూ పారిపోలేదు. దీనికి తోడు అతనిని, అతని సాన్నిధ్యాన్ని గుర్తుచేసేందుకు అన్నట్లుగా వుండేది సంస్కారహీనుడైన నా భర్త ప్రవర్తన.

ఇతనికి రావుుడు పేరు పొరపాటున పెట్టారేమోనన్పించేది చూస్తే... ఎప్పుడూ చిరాకు, కోపం, అరుపులు, కేకలు... భార్య అంటే చెప్పినట్టు చేసే ఒక యంత్రం... అంతే అతని దృష్టిలో.... నన్నుగాని.... నా వ్యక్తిత్వాన్నిగాని కొంచెంకూడా గౌరవించేవాడుకాదు. ఒట్టి మూర్ఖుడు... నరకం ఇంకా బాగుంటుందేమో ఇంతకంటే అన్పించేది ప్రతి క్షణం నాకు. ఫణీంద్రని తలవని రోజు లేదు.

తప్పో ఒప్పో... నా శరీరం మీద తప్ప, నా మనసుమీద నా భర్తకి ఏనాడూ అధికారం ఇవ్వలేదు నేను.

ఆ అధికారంతోనే ఇద్దరు పిల్లలకి తండ్రి అయ్యాడతడు. కాల ప్రవాహంలో అమ్మా నాన్నా పోయారు. అన్నయ్య చాలా దూరంలో తన కుటుంబంతో వున్నాడు. ఊళ్లన్నీ తిరిగి మళ్లీ వైజాగే రావాల్సి వచ్చింది.

''గిరిజా... గిరిజా...'' ఫణీంద్ర గట్టిగా పిలుస్తుంటే గతంలోంచి వర్తమానంలోకి వచ్చాను. ఒక్కసారి తల విదిలించాను.

''ఏంటి ఆలోచిస్తున్నారు...'' చిన్నగా నవ్వుతూ అన్నాడు. అంతలోనే ''అన్నట్టు మీవారు...'' నా ముఖంకేసి పరీక్షగా చూస్తూ అడిగాడు.

''పోయి నాలుగేళ్లవుతోంది'' తలొంచుకుని చెప్పాను.

''పిల్లలు...?'' కాస్సేపాగి అడిగాడు.

''ఇద్దరు మగపిల్లలు'' గడ్డిపీకుతూ చెప్పాను.

''మీరిక్కడే వున్నారా...'' అలవాటులేని ఆ బహువచన సంబోధనకి ఆశ్చర్యంగా చూస్తూ చెప్పాను.

''అవును. ఆర్నెల్లిక్కడ. ఆర్నెల్లు చిన్నకొడుకు దగ్గర'' నమ్మనట్టు చూస్తున్న అతనికి చెప్పాను.

''నిజమండీ... పెద్దవాడిక్కడ రైల్వేస్‌లో పని. కోడలు టీచరు. నన్ను వీళ్ల డ్యూటీగా ఆర్నెల్లు పెట్టుకుంటారు. ఆర్నెల్లు కాగానే విజయవాడలో ఎల్ఐసిలో చేస్తున్న చిన్నవాడి దగ్గరకు పంపించేస్తారు. ఆ కోడలూ ఉద్యోగమే. మళ్లీ అక్కడ ఆర్నెల్లు. తర్వాత'' నేనేనా ఇన్ని మాటలు మాట్లాడింది. నాకే ఆశ్చర్యమనిపించింది.

''బావుంది అయితే. మీ పరిస్థితి నా పరిస్థితి ఒకటే అన్నమాట. నేను కాలేజీలో లెక్చరర్‌గా పనిచేశాను. రెండేళ్లయింది రిటైరై. మీకు ఇద్దరు మగపిల్లలవుతే నాకిద్దరు ఆడపిల్లలు. నా భార్య చనిపోయి పదేళ్లవుతోంది. బ్రెస్ట్ క్యాన్సర్''

జీవితంలో ఎన్ని మార్పులు. మనసులో బాధ అన్పించింది.

''అయితే మీరెక్కడ వుంటున్నారు?'' అడిగాను.

''ఇద్దరాడపిల్లలు పెళ్లిళ్లయి వెళ్లిపోయారు. చాలా దూరంలో వున్నారు. ఎప్పుడో సంవత్సరానికోసారి, అదీ వాళ్ల భర్తలు ఒప్పుకుంటే నన్ను చూడ్డానికి వస్తారు. నేనిక్కడ మూడుగదుల చిన్న ఇల్లు ఎప్పుడో కట్టుకున్నాను. అందులో వుంటున్నాను.''

''ఇక్కడా?''

''అవును. విశాఖపట్నం అన్నా, ఆ జ్ఞాపకాలన్నా

నాకెంతో ఇష్టం''

చటుక్కున తలదించుకున్నాను.

''వస్తాను లేటయిపోతోంది'' లేచాను నేను.

మళ్లీ వీలైతే ఎల్లుండి ఇక్కడే కలవండి గిరిజా'' లేస్తూ అన్నాడతడు.

నన్ను నువ్వనే అనండి అని అందామని నాలుకదాకా వచ్చి ఆగిపోయాను.

వస్తానని చెప్పి బయలుదేరాను. దారిలో కోడలు చెప్పిన వస్తువులన్నీ కొని ఆయాసపడుతూ ఇంటికి చేరాను.

''ఎప్పుడనగా వెళ్లారూ... ఊళ్లో అంత రాచకీయాలేమిటో'' ధుమధుమలాడుతూ కోడలు రమ తలుపు తీసింది. మనసు చివుక్కుమంది. ఇది మొదటిసారికాదు. నోటికి ఎంత మాట వస్తే అంత మాట అంటుంది ఆమె. నా కొడుకు ఏమీ అనడు. అక్కడ ఆ కోడలూ అంతే. అప్పటికీ ఇంటెడు చాకిరీ చేస్తాను నేను. వంటపని, తోటపని, మనవలని తయారుచేయడం, ఇంటికి కాపలా... ఒకటేమిటి నా ఓపిక ఒప్పుకునేవరకూ అన్నీ చేస్తాను. అయినా నాకు విలువలేదు.

బాల్యంలో తండ్రి, అన్న, పెళ్లయ్యాక భర్త, ఇప్పుడు కొడుకులు అందరూ నన్ను మానసికంగా, శారీరకంగా బాధపెట్టినవాళ్లే. ఒక్కొక్కరి జీవితం అంతేనేమో! ఆలోచిస్తూ, చేతిలోని పాలగిన్నె ఎత్తేశాను. మొత్తం పాలంతా నేలపాలు. గబుక్కున వంగి గిన్నె తీసేలోపలే రమ ''అయ్యో మొత్తం పాలన్నీ వలకబోశారా... ఖర్మ... చేయలేకపోతే చేయలేనని చెప్పండి. అంతేగాని అబ్బ... ఎందుకు పనికిరాదీవిడ...'' అంటూ అరవసాగింది.

కళ్లమ్మట నీళ్లు తిరిగాయి.

ఆ రాత్రి అంతా నాకు కలత నిద్రే. ఎడారిలో పన్నీటి జల్లు కురిసినట్లు ఫణీంద్రతో గడిపిన ఆ కొద్ది సమయమే చాలా ఉపశమనం కలిగించింది. అదే గుర్తుకు తెచ్చుకుంటూ పడుకున్నాను.

ఆ ఎల్లుండినుండి నేను ఫణీంద్రని కలవడం మొదలుపెట్టాను. ఇంటెడు చాకిరీ చేసి, కొడుకు, కోడళ్ల విసుగులు భరించి నిరాశా నిస్పృహలతో వున్న నాకు ఫణీంద్ర స్నేహం చాలా ప్రశాంతతనిస్తోంది. వారానికి మూడుసార్లు టంచనుగా పార్కులో కలిసేవాళ్లం.

ఎప్పుడులేంది ఫణీంద్ర చాలా డీలాగా కన్పించాడు.



# మానవతావాది

కొన్ని సంవత్సరాల క్రితం అమెరికన్ నీగ్రో నాయకుడు మార్టిన్ లూథర్‌కింగ్ వధపబడ్డ సంగతి అందరికీ తెలిసిందే. ఒక శ్వేతజాతి ఫాదర్ ఈ హత్యకు (ఎవరో చేసింది) ప్రాయశ్చిత్తంగా 10 నీగ్రో కుటుంబాలకు పోషణ, విద్యాబుద్ధులు నేర్పుతానని ప్రతినబూని అలాగే సాధించాడు. నిజమైన మానవతావాది అతనే కదూ?!

- అచ్యుతుని రాజ్యశ్రీ

''నా అల్లుళ్లు మనుషులు కాదు గిరిజా. పక్కా వడ్డీ వ్యాపారులు. అన్నీ ఇచ్చుకున్నా ఇంకేదో కావాలనే బాధ. నేను మాత్రం వాళ్లకి బరువు కాకూడదు. నాకొంట్లో బాగోకపోతే నా పిల్లల్ని పంపించరు. వాళ్లూ అంతే వాళ్లసుఖాలు వాళ్లు చూసుకున్నారు. నేనెవరికీ అక్కర్లేదు.'' కళ్లమ్మట నీళ్లతో అతనలా చెప్తుంటే దిగజారిపోయిన ఇతని పరిస్థితి జాలి కలిగించింది. ఎలాంటి ఫణీంద్ర ఎలా అయిపోయాడు. ఓదార్పు చెప్తున్నట్లుగా సంశయిస్తూనే అతని చేయిపై చేయివేశాను.

''గిరిజా... ఒక మాట అడుగుతాను... ప్రశాంతంగా వింటావా...''

ఏమిటన్నట్లు చూశాను.

''నువ్వేమీ అనుకోనంటే నాదో విన్నపం. జీవితంలో ఇద్దరం చాలా దూరం ప్రయాణం చేశాం. దురదృష్టవశాత్తు ఇద్దరికీ దారంతా ముళ్లే. ఈ చివరి రోజుల్లోనైనా ఒకరికొకరం తోడు కావాలనుకుంటున్నాం. మనం మన పిల్లలకే అక్కర్లేదు. బ్రతికున్న ఈ నాలుగురోజులు కలిసి బ్రతుకుదాం. నువ్వు, నేను కలిసి ఓల్డ్ ఏజ్డ్ హోమ్‌లో చేరుదాం. ఇప్పుడెవరికీ భయపడాల్సిన అవసరం లేదు. నీకు నేను, నాకు నువ్వు తోడుగా వుందాం. నా మాట కాదనకు. ఇవి ఆవేశంలో అనే మాటలుకావు. జీవితంలో ఎదురుదెబ్బలు తిని తిని చాలా అలసిపోయాను. భార్యవల్ల, పిల్లలవల్ల ఎటువంటి సుఖం పొందలేకపోయాము.

నాకు తోడుకావాలి. నీలాంటి మనిషి ఆదరణ కావాలి. నీ స్నేహం కావాలి. ఆలోచించుకుని ఎల్లుండి ఈ పార్కుకి రా. ప్లీజ్...'' చిన్నగా అదురుతున్న స్వరంతో స్పష్టంగా చెప్పాడతను.

ఇంటికి వచ్చానన్నమాటేగాని, మనసు మనసులో లేదు. ఏమన్నాడు ఫణీంద్ర. కలిసి హోంలో బతుకుదామన్నాడా? అది సాధ్యమేనా... కొడుకులేమనుకుంటారు. అతని పిల్లలేమనుకుంటారు... అయినా ఒకింట్లో కాదుగదా వుండేది.... హోంలో... అక్కడ ఎవరిష్టపడితే వాళ్లుండచ్చు. కాకపోతే ఆ హోంలో తను ఫణీంద్ర ఒక జట్టు... అతను నన్నుచూస్తూ, నేను అతనికి సేవ చేస్తూ... ఇక్కడ ఈ తిట్లు, చికాకులు భరించేకంటే అదే మేలేమో... తల పగిలే ఆలోచనలతో రాత్రంతా నిద్రపట్టలేదు.

తెల్లవారింది. రావలసిన రోజు వచ్చింది. ఇదేనా ఆఖరి అవకాశం. ఎవరి జీవితాల్ని వాళ్లు నందనవనంగా మార్చుకోవాలంటే కొంచెం సాహసం కావాలి. నాకు లేనిదే అది. చిన్నతనంలో చదువుకుంటాను అని ధైర్యంగా నాన్నకి చెప్పలేకపోయాను. ప్రేమించిన ఫణీంద్రని పెళ్లిచేసుకుంటాను అని ధైర్యంగా చెప్పలేకపోయాను. మూర్ఖుడిలా ప్రవర్తించే భర్తని ధైర్యం చేసి సరైన దారిలో పెట్టలేకపోయాను. కన్న కొడుకులపై మమకారం తప్ప తల్లిగా అధికారం చూపించలేకపోయాను. ఈరోజు ఈ ముసలితనంలో చిన్ననాటి స్నేహితుడు... నన్ను నన్నుగా అర్థం చేసుకున్నవాడు అయిన ఫణీంద్ర జీవితపు చివరి మజిలీలో శాంతిని నింపుతానని అవకాశం ఇస్తుంటే... ధైర్యం ఇకనైనా చూపకపోతే నష్టపోయేది నేనే. ఆలోచించాను. బాగా ఆలోచిస్తున్నాను. ఆ ఆలోచనలలోంచే ఒక నిర్ణయానికి వచ్చాను. నా కొడుకులకి రావాల్సినది, చెప్పాల్సినది, అంతా కాగితంపై రాశాను. ఒకటి విజయవాడ పోస్ట్ చేశాను. నా సూట్ కేస్ సర్దుకున్నాను. నాలోని ఈ తెగింపు నాకే నమ్మబుద్ధి కావడంలేదు. పార్కుకి బయలుదేరాను.

పార్కులో నాకోసం ఫణీంద్ర వెయిట్ చేస్తున్నాడు. నెమ్మదిగా నడుచుకుంటూ అతని దగ్గరకు వెళ్లాను. ఎనిమిదో వింత జరిగినట్టు చూస్తున్నాడతడు. అతని చేతులలో ఒరిగిపోయాను.